మాసుకనీ, డాక్టర్లకనీ, డబ్బుకనీ, తడిమన్ను పొడిమన్ను అయేలా తిరిగి, రాత్రులు నిద్రపట్టక నీరసించివున్న రోజుల్లో, తన పక్కనే, కంటికి రెప్పలా కూమని ఉన్నప్పుడు, అతని కళ్లలోతుల్లో మెరిసిన ఆందోళన ఇంకా కలవర పెడుతూనే వుంది.

ఒకదాని తరవాత వొకటి జ్ఞాపకానికొస్తున్నాయి. వెనక రసూలుకొండలో వున్నప్పుడు చలపతిరావుకి మన్యపుజ్వరంవచ్చి ఆరునెలలు మంచంపట్టాడు. అప్పుడు మంచుగడ్డ కడుతూంటే, అతనన్నమాటలింకా చెవిలో గింగురు మంటున్నాయి.

"లక్ష్మీ, నీరుణం తీర్చుకోలేనే"

"ఛా. అలాఅనకండి — నన్ను చంపుకుతిన్నట్టే"

ఆలోచనలింకా వెనక్కినడిచివెళ్ళి, చిన్ని చిన్ని అనుభవాల్ని నెమరుకి తెచ్చుకుంటున్నాయి. కాపరానికి వెళ్ళినకొత్తలో, తోటపల్లి కొండలకి శాంతిఆశ్రమం చూదామని వెళ్ళినప్పుడు, ఆ నున్నని బండరాళ్ళమీద నించీ, తన కాలుజారుతుందేమోనని మాటి మాటికీ వెనక్కితిరిగిచూస్తూ, చేతులందించిన రోజులూ, అప్పటి జ్ఞాపకాలూ, ఇంకా మనస్సులో రెపరెపలాడుతున్నాయి.

న్నాడు — ఇప్పుడు — ముహూర్తం నాలుగురోజులుం దనగా—ఆయన తొందరపడి వస్తే గలభా అవుతుందట ! తనే వచ్చి సంగతులన్నీ విశదంగా చెప్తాడట స్వయంగా.

ఉత్తరం చించి ముక్కలు తనదగ్గరనే ఉంచుకుంది.

రక్తమొచ్చేలా పెదిమలు కొరుక్కుంటోంది. ఏమిటి చేస్తుంది ? దుఃఖమూ, కోపమూ, ఒకదాని వెనక వొకటి తరుముకొస్తున్నాయి; కన్నీళ్లు జలజలజలా ప్రవహించి పోతున్నాయి; ఏదో అమృతభాండం బద్దలయి పోయినట్లు, బ్రతుకే శూన్యమైపోయినట్లు బాధపడింది.

అర్ధరాత్రి - గాఢాంధకారం - తెరలు తెరలుగా పెనవేసుకుంటున్నాయి నల్లని వానకారుమబ్బులు. చలపతిరావుకి మెళుకువవచ్చింది. లక్ష్మి కిటికీదగ్గర కూచుని ఏడుస్తోంది.

"లక్ష్మి"

గబగబా కళ్ళు తుడిచేసుకుంటోంది.

లాలనగా దగ్గిరికి తీసుకున్నాడు. ఆశ్చర్యమైంది.

"ఎందుకు ?"

"ఏమీలేదు."

